క్లుప్తంగా

ఎర్ర బ్యాడ్జీలతో ఎన్ఎంయూ నిరసన


ఎర్ర బ్యాడ్జీలతో విధులకు హాజరైన ఉద్యోగులు

చీరాల అర్బన్: విజయవాడలోని ఆర్టీసీ స్థలమైన గవర్నర్‌పేట–1 డిపోలోని స్థలాన్ని లులూ సంస్థకు లీజుకు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ ఆదివారం నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ చీరాల డిపో ఉద్యోగులు ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఆర్టీసీ స్థలాలను ఇతర సంస్థలకు లీజుకు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉదయం మొదటి సర్వీసు నుంచి ఎర్ర బ్యాడ్జీలు ధరించి విధులుకు హాజరయ్యారు. డిపో కార్యదర్శి దయాబాబు, సీసీఎస్ డెలిగేట్ ప్రవీణ్‌కుమార్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా పాండురంగ స్వామి

బల్లికురవ: బల్లికురవ ఇన్‌చార్జి ఎంపీడీవోగా కార్యాలయ అడ్మిన్‌స్ట్రేటివ్ అధికారి పాండురంగ స్వామి ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేస్తున్న కుసుమ కుమారి సోమవారం నుంచి నెలరోజులపాటు బాపట్లలో జరిగే ఫౌండేషన్ శిక్షణకు హాజరుకావాల్సి ఉంది. జిల్లా పరిషత్ సీఈఓ ఆదేశాల మేరకు పాండురంగ స్వామి బాధ్యతలు చేపట్టారు. మండలంలోని ప్రధాన సమస్యల పరిష్కారానికి శక్తి వంచనలేకుండా పనిచేస్తానని చెప్పారు.

గ్రామ దేవతలకు మొక్కులు

బల్లికురవ: శ్రావణ మాసం మొదటి ఆదివారం తదియ సందర్భంగా గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేపట్టారు. బల్లికురవ, గుంటుపల్లి, కొమ్మినేని వారిపాలెం, కొప్పరపాడు, వైదన, కొప్పరపాలెం, నక్కబొక్కలపాడు, కొణిదెన, మల్లాయపాలెం గ్రామాల్లోని గ్రామ దేవతలైన పోలేరమ్మ మహాలక్ష్మమ్మ, గంగమ్మ ఆలయాలకు భక్తులు తమ మొక్కులు తీర్చుకున్నారు. పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని అమ్మవార్లను ప్రార్థించి ప్రత్యేక పూజలు చేపట్టారు. అర్చకుల ఆధ్వర్యంలో ఆయా ఆలయాల్లోని అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు.

వరి గడ్డి వామి దగ్ధం

వేటపాలెం: మండల పరిధిలోని చల్లారెడ్డిపాలెం పంచాయతీ కొత్తపాలెం దగ్గరలోని దత్త క్షేత్రం కాలనీలో బాలయోగి ఆశ్రమ గోశాలకు చెందిన వరి గడ్డి వామి ఆదివారం అగ్నికి ఆహుతైంది. స్థానికులు చీరాల అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. అయితే వరి గడ్డి వామి అప్పటికే పూర్తిగా కాలిపోయింది. గుర్తు తెలియని వ్యక్తులు గడ్డి వామికి నిప్పు అంటించి ఉంటారని గోశాల నిర్వాహకులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం పశు గ్రాసం ధరలు ఆకాశాన్ని అంటున్న తరుణంలో గడ్డి వామి తగలబడటంతో గోశాల నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు. గోశాల్లో ఉన్న గోవులకు గ్రాసం ఎక్కడ నుంచి తీసుకు రావాలని ప్రశ్నిస్తున్నారు.

ఘనంగా కార్గిల్ దివస్

మార్టూరు: మండల కేంద్రం మార్టూరులో శనివారం రాత్రి కార్గిల్ దివస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎఫర్ట్ కార్యాలయంలో మార్టూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నలుగురు విశ్రాంత మిలిటరీ అధికారులను ఘనంగా సత్కరించి సన్మానించారు. హవల్దార్ కె. రూబెన్, పత్తిపాటి హనుమంతరావు, కళ్ళం నరేంద్ర కుమార్ రెడ్డి, బాచిన వెంకట రామారావును ఘనంగా సన్మానించారు. మిలిటరీ అధికారులు తమ అనుభవాలను పంచుకున్నారు. మార్టూరు రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మాదాల సాంబశివరావు, చెరుకూరి నాగేశ్వర రావు, గోనుగుంట్ల రవికుమార్, రావి అంకమ్మ చౌదరి, జేవీ మోహన్ రావు పాల్గొన్నారు.

యువకుడికి గాయాలు

అద్దంకి రూరల్: ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తా కొట్టటంతో యువకుడికి గాయాలైన సంఘటన మండలంలోని శింగరకొండ మలుపు వద్ద ఆదివారం చోటు చేసుకుంది. శంకరాపురం గ్రామానికి చెందిన అనిల్ పని నిమిత్తం శింగరకొండ వైపు వెళుతుండగా మలుపువద్ద బైకు అదుపుతప్పి కిందపడ్డాడు. 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

బాపూజీకి అవార్డు

అద్దంకి రూరల్: అద్దంకి ప్రాంతంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అద్దంకికి చెందిన కొండముది బాపూజీకి ఆదివారం తెలుగు సాంస్కృతిక సాహితి సేవాట్రస్ట్ అవార్డు ఆదివారం బెంగళూరులో అందజేశారు. ఈ మేరకు ఆయన తెలియజేశారు. సేవాకార్యక్రమాలను గుర్తించి సాంస్కృతిక సాహితీ సేవాట్రస్ట్ అవార్డు అందజేయడం ఆనందంగా ఉందన్నారు.

అద్దంకి ట్రైనీ ఎస్సైగా వెంకటేశ్వర రెడ్డి

అద్దంకి రూరల్: అద్దంకి ట్రైనీ ఎస్సైగా పి. వెంకటేశ్వరరెడ్డి శనివారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. 2013లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించి 2022లో నోటిఫికేషన్‌లో ఎస్సైగా సెలక్ట్ అయి 2024 వరకు అనంతపురంలో శిక్షణ పొందారు. అనంతరం అద్దంకి సీఐ సుబ్బరాజును కలిసి ట్రైనింగ్ ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు.

ఉన్నత లక్ష్యానికి గ్రహణం

- చిట్టడవిని తలపిస్తున్న బొమ్మనంపాడు జగనన్న కాలనీ
- కాలనీ నిండా పెరిగిన చిల్ల చెట్లు
- అభివృద్ధి శూన్యం, తాగునీరు దొరకదు..
- మురుగు కాలువలకు దిక్కు లేదు

మొత్తం ప్లాట్లు	1213
పంపిణీ చేసిన ప్లాట్లు	631
నిర్మాణం పూర్తి చేసుకున్న ఇళ్లు 230	వివిధ దశల్లో ఉన్న గృహాలు 401


అడవిని తలపిస్తున్న కాలనీ

అద్దంకి:

కూటమి ప్రభుత్వం.. పేదలను చులకనగా చూస్తోంది. గత వైఎస్సార్ సీపీ చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ఉద్దేశ పూర్వకంగా నీరుగారుస్తున్నారు. పేదవాడి సొంతింటి కల సాకారం కావాలనే ఉద్దేశంతో నాడు వేసిన జగనన్న లే అవుట్‌లు ప్రస్తుతం చిల్ల చెట్లతో నిండి కీకారణ్యాన్ని తలపిస్తున్నాయి. మౌలిక వసతులు కూడా కల్పించకుండా చోద్యం చూస్తున్నారు.

అద్దంకి పట్టణంలోని పేదల కోసం వేలమూరిపాడు సమీపంలో, నాగులపాడు గ్రామ సమీపంలో, బొమ్మనంపాడు వద్ద నాడు వైఎస్సార్ సీపీ హయాంలో లే అవుట్లు వేశారు. అయితే అందులో బొమ్మనంపాడు గ్రామ సమీపంలోని జగనన్న లే అవుట్‌లో కనీస వసతులు లేకపోవడంతో ఇళ్లు నిర్మించుకునేందుకు ఎవరూ సాహసించడంలేదు. ఇక్కడ మొత్తం 1213 ప్లాట్లు కేటాయించగా 632 ప్లాట్లు పపిణీ చేశారు. అందులో 230 గృహాలు పూర్తయ్యాయి. 250 పైగా గృహాలు వివిధ దశల్లో ఉన్నాయి.

తాగునీటి సైకర్యం ఇంత వరకూ లేదు. అదే విధంగా రహదారులు, సైడు కాలువలు ఏర్పాటు చేయలేదు. దాంతో గృహాలు కట్టుకునే వారు వెనక్కు తగ్గుతున్నారు. ఇప్పటికే గృహాలు నిర్మించుకున్న వారు నానా అవస్థలు పడుతున్నారరు. ఇక్కడ ఇవశించే వారు తాగునీటి కోసం అద్దంకి రావాల్సిన దుస్థితి ఉంది. విద్యుత్ స్తంభాలు సైతం పడిపోయే దశలో ఉన్నాయి. ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.


ఇళ్ల నిర్మాణం జరిగిన ప్రదేశంలో చెట్లు

> **త్వరలో తాగునీటి సాకర్యం**
>
> బొమ్మనంపాడు లే అవుట్‌లో త్వరలో తాగునీటి సౌకర్యం కల్పిస్తాం. దానికి సంబంధించి మునిసిపాలిటీకి ప్రతిపాదలు పంపాం . అదే విధంగా రహదారులు, మురుగు కాలువలు నిర్మించాల్సి ఉంది.
>
> – కిరణ్‌కుమార్, ఏఈ హౌసింగ్

దోమల బెడద.. రోగాల వరద


వాడరేవు గ్రామంలో అధ్వానంగా ఉన్న చెత్తకుప్పలు

- దోమలు విజృంభిస్తున్నా పట్టించుకోని అధికారులు
- అటకెక్కిన ఫాగింగ్ మిషన్లు
- పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తం

చీరాల టౌన్: ప్రజారోగ్యానికి పెద్ద పీట వేస్తున్నామంటూ ప్రగల్భాలు పలికే అధికారులు చేతలకు వచ్చే సరికి నోరు మెదపడంలేదు. చీరాల మండలంలో దోమలును నిర్మూలించే ఫాగింగ్ మిషన్లు ఉన్నప్పటికీ వాటిని వినియోగించడం లేదు. ఎక్కడ చూసినా మురుగు తాండవిస్తోంది. దోమల బారి నుంచి ప్రజలు కాపాడాల్సిన బాధ్యతను మరిచారు. మురుగు నీటి కుంటల్లో పైరేత్రంను పిచికారీ చేయించడంలేదు. ఫలితంగా ప్రజలు రోగాల బారినపడి ఆసుపత్రుల్లో చేరుతున్నారు.మండలంలో 23991 నివాస గృహాలున్నాయి. మండలంలో 85,696 మంది జనాభా ఉన్నారు. అయితే కొద్దిపాటి నిధులను సైతం పంచాయతీ కార్యదర్శులు డ్రా చేసుకుని ఖర్చుల్లో చూపుతున్నారు. గ్రామాల్లో సరైన పారిశుద్ధ్య నిర్వహణ చేయడంలేదు. పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు సక్రమంగా జీతాలు ఇవ్వకుండా, కనీసం బ్లీచింగ్ కూడా కొట్టకుండా కొందరు పంచాయతీ కార్యదర్శులు విడతల వారీగా డబ్బులు డ్రా చేసుకున్నారనే ప్రచారం జరుగుతోంది. పంచాయతీలు ప్రత్యేక అధికారుల పాలనలో ఉడటంతో వారు తమ పనులను చక్కబెట్టుకోవడమే కానీ.. వారానికి ఒక్కసారి కూడా గ్రామాలను దర్శిస్తున్న దాఖలాలులేవు. ఈవిషయమై మండల ఈవోఆర్డీ రామకృష్ణను వివరణ కోరగా పంచాయతీలకు ఫాగింగ్ మిషన్లు ఉన్నాయన్నారు. ప్రతీ గ్రామంలో విధిగా వారానికి రెండు, మూడు సార్లు ఫాగింగ్ చేయవచ్చని తెలిపారు. ఫాగింగ్ మిషన్లు విధిగా వాడేలా అన్నీ పంచాయతీల కార్యదర్శులకు ఆదేశాలిస్తామని చెప్పారు.


పిట్టువారిపాలెం రోడ్డులో దోమలకు ఆవాసాలుగా మారిన నీటి నిల్వలు

ఘనంగా అబ్దుల్ కలాం వర్ధంతి


పలపర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అబ్దుల్ కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న స్థానికులు


చినగంజాంలో కలాంకు నివాళులర్పిస్తున్న ముస్లిం సోదరులు

చినగంజాం: భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం 10వ వర్ధంతిని ఆదివారం చినగంజాంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం చినగంజాంలోని మసీదు పేటలో ముస్లిం నాయకులు ఆయన వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. క్షిపణి శాస్త్రవేత్త, దార్శనికుడు, నిజమైన దేశ భక్తుడు ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని నిర్వహించడం సంతృప్తిని ఇస్తుందని ముస్లిం నాయకులన్నారు. కార్యక్రమంలో ఎంఐఎం మండల అధ్యక్షుడు పఠాన్ సుభాని ఖాన్, టౌన్ ప్రెసిడెంట్ షేక్ ఇసూబ్, ఎండీ జియావుల్‌హక్, పఠాన్ బాబు, షేక్ ఇమ్రాన్, షేక్ సాధిక్, షేక్ నాగూర్, బాజీ, షేక్ సాహుల్, చినగంజాం మండల కేంద్రం మసీదు పేటలోని ముస్లిం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మార్టూరు: మాజీ రాష్ట్రపతి అణు శాస్త్ర పితామహుడు ఏపీజే అబ్దుల్ కలాం 10వ వర్ధంతి వేడుకలను మండలంలోని వలపర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కలాం విగ్రహానికి స్థానికులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. టి. అనిల్, షేక్ అక్రం, జంజనం సాయి, తాళ్లూరి సాగర్, షేక్ అబ్దుల్లా, షేక్ వహీద్, ఆరిఫ్, ఆంజనేయులు, బాజీ పాల్గొన్నారు. మార్టూరులోని విశ్రాంతి ఉద్యోగుల కార్యాలయంలో గల ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహం వద్ద మార్టూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా వర్ధంతి వేడుకలు నిర్వహించారు

మమ్మేలు తల్లీ.. గంగమ్మా!


భక్తులకు ప్రత్యేక దర్శనంలో గంగమ్మ తల్లి


మొక్కుబడులు తీర్చుకొనేందుకు బారులు తీరిన భక్తులు

కారంచేడు: భక్తుల ఆపదలను తీర్చే కల్పవల్లిగా, కారంచేడు గ్రామ దేవతగాను విరాజిల్లుతున్న గంగమ్మ తల్లికి భక్తులు తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. కార్తీకమాసం ఆదివారం అమ్మవారికి ప్రీతికరమైన రోజు అనిభక్తుల విశ్వాసం. ఆదే విశ్వాసంతో అమ్మవారికి వేకువజాము నుంచే భక్తులు పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి ఇష్టమైన పొంగళ్ళను నైవేద్యంగా సమర్పించారు. వ్యవసాయ పనులు త్వరలో ప్రారంభించే రైతన్నలు తమ సాగుకు ముందుగానే అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీ. అలాగే ఉద్యోగాల్లో చేరిన ఉద్యోగులు తమ మొక్కుబడులు తీర్చుకొనేందుకు ఆలయంలో బారులు తీరారు. అనంతరం భక్తులకు ఆలయ అర్చకులు ఆవుల రాజేష్ తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించారు.

రామారావుకు అభినందనలు


రామారావును అభినందిస్తున్న మండల పార్టీ నాయకులు

చినగంజాం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహనరెడ్డి ఆదేశాల మేరకు పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎంప్లాయీస్, పెన్షనర్ల విభాగం అధ్యక్షునిగా నియమితులైన మార్కాపురం వెంకట రామారావును మండల నేతలు అభినందించారు. మండల కన్వీనర్ మున్నం నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో రామారావుకు శాలువా కప్పి మండల కమిటీ సభ్యులు అభినందనలు తెలియజేశారు. పదవి ఇవ్వడం పట్ల పార్టీ పట్ల పూర్తి విధేయతతో విధులు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో కొల్లాటి ఏడుకొండలు, మేడికొండ సునీల్, ఆసోది సూర్యనారాయణరెడ్డి, గుమ్మడి ఉమాశంకర్‌రెడ్డి, అమరా శ్రీనివాసరావు, వాటుపల్లి రాములు, పఠాన్ సైదా, వాటంబేటి శ్రీరాములు రెడ్డి పాల్గొన్నారు.

కూటమి మోసాలు ఎండగట్టాలి


కూటమి ప్రభుత్వ విధానాలపై నాయకుల ప్రచారం

ఇంకొల్లు(చినగంజాం): వైఎస్సార్‌సీపీ నియోజక వర్గ ఇన్‌చార్జ్ గాదె మధుసూదన రెడ్డి ఆదేశాల మేరకు పర్చూరు మండలంలో ఆదివారం బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మండల కన్వీనర్ కఠారి అప్పారావు అధ్యక్షతన ఆదివారం చిన్ననందిపాడు, అడుసుమల్లి, బోడవాడ గ్రామాల్లో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అబద్ధాల్లో చంద్రబాబు పీహెచ్‌డీ

చీరాల అర్బన్: చంద్రబాబు నాయుడు అబద్ధాలు చెప్పి ప్రజలను మోసం చేయడంలో పీహెచ్‌డీకి మించి పోయారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు యాతం మేరీ బాబు పేర్కొన్నారు. చీరాల పట్టణం 31,32 వార్డుల్లో నియోజకవర్గం ఇన్‌చార్జి ఆదేశాల మేరకు పట్టణ అధ్యక్షుడు యాతం మేరీ బాబు ఆధ్వర్యంలో బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలను తుంగలో తొక్కి ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వాన్ని ఎండగట్టారు. ఎస్సీ సెల్ అధ్యక్షుడు వాసుమల్ల వాసు, 31వ వార్డు ఇన్‌చార్జ్ నియోజవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు సల్లు అనీల్, సీనియర్ నాయకులు చెల్లిబాబురావు, గోసాల అశోక్, 33వ వార్డు నాయకులు ఇన్నయ్య, విద్యార్థి విభాగం ఇన్‌చార్జి కోండ్రు పూర్ణ, పోతురాజు, చక్రవర్తి పాల్గొన్నారు.

ఏడాదిలోనే కూటమిపై వ్యతిరేకత


ముస్నంగివారిపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

యద్దనపూడి: ఎన్నికల ముందు అలివికాని హామీలిచ్చి అవి నెరవేర్చలేక ఇప్పుడు చంద్రబాబు చెబుతున్న అబద్ధాలు, చేస్తున్న మోసాలు, రెడ్‌బుక్ రాజ్యాంగ అరాచకాలను ప్రజలకు తెలియజేసి వారిని చైతన్య పరచటమే వైఎస్సార్‌సీపీ లక్ష్యమని మాజీ ఎంపీపీ, నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షుడు మువ్వల రాంబాబు అన్నారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త గాదె మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు మండల కన్వీనర్ రావూరి వేణుబాబు ఆధ్వర్యంలో మండలంలోని చిమటవారిపాలెం, తనుబొద్ది వారిపాలెం, మున్నంగివారిపాలెం గ్రామాల్లో బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఏడాదిన్నరా దాటినా కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయని తీరును ప్రజలకు వివరిస్తూ క్యూ ఆర్ కోడ్‌తో కరపత్రాలను పంచిపెట్టారు. సర్పంచ్‌లు గనిపిశెట్టి వెంకాయమ్మ, చల్లా అన్నపూర్ణమ్మ, మున్నంగి బసివిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు తనుబొద్ది వీరారెడ్డి, యన్నం శ్రీను, మేరిగ ప్రసాద్, గడ్డం హనుమంతురావు, మున్నంగి సీతారామిరెడ్డి, భవనం వెంకటరెడ్డి , అంజిరెడ్డి, కుంచపు నాగేశ్వరావు నల్లపునేని లక్ష్మయ్య, దొడ్డా రవి, కల్లం వెంకటరెడ్డి, టంకసాల చెంచురామయ్య, మండవ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలకు విశేష స్పందన


యద్దనపూడి: మెడికల్ క్యాంపుకు హాజరైన ప్రజలు

యద్దనపూడి: మండల పరిధిలోని పూనూరు గన్నమనేని కోటిస్వామి అండ్ మేడూరి మురళీకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం పాఠశాల పూర్వవిద్యార్థుల ఆధ్వర్యంలో కాటూరి మెడికల్ ఆసుపత్రి వారి సౌజన్యంతో మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. 1950 సంవత్సరంలో స్థాపించిన పూనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 75 సంవత్సరాలను పూర్తి చేసుకొని డైమెండ్ జూబ్లీ వేడుకలకు సన్నద్ధమవుతున్న సదర్భంగా ఈ క్యాంపు నిర్వహించారు. 420 మందికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. జనరల్ మెడిసిన్ హెడ్ దేవరవాయి, శ్రీసన, మనోజ్ఞ, ఎముకల వైద్యులు సౌమ్య, చర్మవ్యాధుల నిపుణులు విద్యాధర్, కంటి వైద్య నిపుణులు వేదవ్యాస్, చెవు, ముక్కు, గొంతు వైద్య నిపుణులు భాగ్యశ్రీ, పల్మనాలజిస్టు పూజిత, జనరల్ సర్జన్ భాగ్యశ్రీ, ఆసుపత్రి ఇన్‌చార్జ్ రామకృష్ణ, పాఠశాల నిర్మాణ వ్యవస్థాపక వంశీయులు మేడూరి కృష్ణయ్య, బత్తుల కృష్ణవేణి,దీవీ బావానాచార్యులు, హెచ్ఎం శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

చీరాల: వాడరేవులోని శ్రీరామానంద ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆశ్రమం ఆవరణలో ఆదివారం షుగర్ వ్యాధికి ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యశిబిరానికి వివిధ ప్రాంతాల నుంచి 1117 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా వైద్యులు రోగులకు షుగర్ వ్యాధిపై అవగాహన కల్పించారు. రోజువారీ జీవన విధానం మార్చుకోవాలని సూచించారు. ఆహారపు అలవాట్లు మార్చుకుంటే షుగర్ నియంత్రణలో ఉంటుందన్నారు. నారాయణం సురేష్, డాక్టర్లు ఎం.రాజేశ్వరి, కమలా రాజేశ్వరి, లలిత్ ప్రకాష్, పేట శ్రీకాంత్, ప్రకాష్, కె.కృష్ణారావు పాల్గొన్నారు.

అద్దంకి: రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఉదయం 9 గంటలకు రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ ఆధ్వర్యంలో అహ్మద్ స్పెషాలిటీ క్లినిక్‌లో నిర్వహించారు. శివధర పూర్ణచంద్రరావు, అశోహరి హరి ప్రసాద్, డాక్టర్ చదలవాడ ఫణీంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా పోలేరమ్మ కొలుపులు


గ్రామోత్సవంలో పోలేరమ్మతల్లి చిత్రపటం


జాతరలో వీరతాళ్ళతో నృత్యాలు చేస్తున్న భక్తులు

కారంచేడు: అన్నదాతల ఇలవేల్పు పోలేరమ్మ తల్లి కొలుపులను ఆదివారం కన్నుల పండువగా నిర్వహించారు. గ్రామస్తులంతా సుఖ సంతోషాలతోను, ఆయురారోగ్యాలతో, పాడి పంటలతో ఉండాని కొలుపులు చేయడం ఆనవాయితీ. ప్రతి ఏడాది సాగుకు ముందు గ్రామంలో ప్రాంతాల వారిగా ఈ కొలుపులు చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కుబడులు చేసుకుంటారు. ఆదివారం గ్రామంలోని గండి బజారుకు చెందిన అన్నదాతలు, యువకులు, చిన్నారులు, మహిళలు పెద్ద ఎత్తున పోలేరమ్మకు పూజలు చేశారు. ఉదయం గ్రామంలోని రెండు చెరువుల మధ్య కొలువైన అమ్మవారికి తలంటు స్నానాలు చేయించారు. మధ్యాహ్నం మేళతాళలతో అమ్మవారికి నైవేద్యాలను అర్పించారు. రాత్రికి అమ్మవారి చిత్రపటంతో ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై ఊరేగింపు నిర్వహించారు.యువకులతో పాటు చిన్నారులు వీరతాళ్ళతో నృత్యాలు చేశారు. విచిత్ర వేషధారణలు ఆకట్టుకున్నాయి. ఇంటింట అమ్మవారికి పసుపు, కుంకుమలను సమర్పించారు. భక్తులకు సౌకర్యాలు కలగకుండ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ చూపరులను విశేషంగా ఆకట్టుకుంది.

ఉపాధి మస్టర్లన్నీ బోగస్సే

బల్లికురవ: హైదరాబాద్, చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు, పట్టణాల్లో చదువుకుంటున్న విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగులను ఉపాధి కూలీలుగా చూపించి బోగస్ మస్టర్‌లతో రూ. 20 లక్షల పైచిలుకు స్వాహా చేశారని పాత మలాయపాలెం మాజీ సర్పంచ్ అబ్బారెడ్డి బాలకృష్ణ ధ్వజమెత్తారు. ఆదివారం పాత మల్లాయపాలెం గ్రామంలో ఆదివారం జరిగిన గ్రామ సభలో బోగస్ మస్టర్‌లు, అవినీతిపై తగిన ఆధారాలతో ఫిర్యాదు చేశారు. వలసలను నిరోధించేందుకు ప్రవేశపెట్టిన ఉపాధిహామీ పథకం కూటమి ప్రభుత్వ హయాంలో గ్రామ స్థాయి నేతలకు, ఆ పథక అధికార సిబ్బందికి కాసుల వర్షం కురిపిస్తోంది. మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో 2024–25 ఆర్థిక సంవత్సరానికి రూ. 12 కోట్లతో 645 పనులు పూర్తి చేసినట్లు రికార్డుల్లో చూపిస్తున్నారు. వారం రోజులుగా ఎస్ఆర్‌పీలు, డీఆర్‌పీల ఆధ్వర్యంలో గ్రామాల్లో జరుగుతున్న సామాజిక తనిఖీల్లో అవినీతి బట్టబయలు అవుతోంది. పాత మల్లాయపాలెంలో 70 మంది వరకు గ్రామాల్లో లేని వారికి బోగస్ మస్టర్లు వేసినట్లు గ్రామ సభలో బాలకృష్ణ వివరించారు. అవినీతికి పాల్పడ్డవారి నుంచి రికవరితోపాటు వేటు వెయ్యకపోతే తాను ఎంతటి ఆందోళనకైనా సిద్ధమేనన్నారు. ఆగస్టు 6న బల్లికురవలో జరిగే బహిరంగ ప్రజావేదికలో అక్రమాలు పూర్తి స్థాయిలో వెలుగులోకి రానున్నాయి. ఈ గ్రామ సభలో తులసీ నాయక్, డీఆర్‌పీ అంజయ్య, ఏపీఓ రమాదేవి, గ్రామ పంచాయతీ సెక్రటరీ మీరావలి పాల్గొన్నారు.